క్లుప్తంగా

విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు సన్మానం



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణస్వీకార కార్యక్రమంలో భాగంగా కలిసినట్లు సేవాదళ్ అధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి మారుతి బాబు సూచించారు. మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అయేషా, హెల్త్ సూపర్ వైజర్ హరిణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మమాట-అంగన్‌వాడీబాట ప్లకార్డులను ప్రదర్శిస్తూ విద్యార్థులు కామారెడ్డి ఎల్లారెడ్డి ప్రధాన గుండా ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పరీక్ష కిట్ల పంపిణీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎండ్రియాల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం హెల్పింగ్ ఫర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కృష్ణాకర్ సాయంతో విద్యార్థులకు పరీక్షా కిట్లను పంపిణీ చేశారు. పరీక్ష ప్యాడ్‌లు, నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, ప్రతినిధులు మహిపాల్ తదితరులున్నారు.

మట్టి వినాయకులనే ప్రతిష్ఠించాలి



బీబీపేట : మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. ప్రతిఏడాదిలాగే ఈఏడాది కూడా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ సందర్భంగా సోమవారం జీపీ వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది 50%శాతం రాయితీతో ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ సభ్యులు ఈ సంవత్సరం 2 ఫీట్‌ల నుండి 7 ఫీట్ల వరకు పర్యావరణ పరిరక్షణ నిమిత్తం మట్టి వినాయకులను పంపిణీ చేయనున్నామన్నారు.

కబ్జా కోరల్లో బోజర్ వాగు



భిక్కనూరు : మండల కేంద్రం సమీపంలోని బోజర్ వాగును ఎంఎస్ఎన్ కంపెనీ యాజమాన్యం కబ్జా చేశారని వెంటనే చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు పరిరక్షణ కమిటీ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవీందర్ సోమవారం భిక్కనూరు తహసీల్దార్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీకి చెందని స్థలాన్ని సర్వే నిర్వహించాలని కబ్జా చేసిన బోజర్ వాగును కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు. ఆయన వెంట మండల ప్రతినిధులు కర్రోల్ల రాజు, గోసు స్వామి, శ్రీకాంత్, చంద్రశేఖర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో స్కూల్ భవనం

- మూతపడ్డ భవానీరోడ్డు ప్రభుత్వ పాఠశాల
- మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల విన్నపం



మూతపడి శిథిలావస్థకు చేరిన భవానీరోడ్డు పాఠశాల భవనం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పాత పట్టణం భవానీరోడ్డులోని 75 యేళ్లనాటి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూతపడి ఐదేళ్లు గడిచిన ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థులు లేక పాఠశాల భవనానికి ఐదేళ్లుగా తాళం వేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. స్వాతంత్ర్యం అనంతరం 1950 ప్రాంతంలో కామారెడ్డి పాత పట్టణం భవానీరోడ్డులోని అద్దె ఇంట్లో ఎన్‌బీఎస్ (న్యూ బేసిక్ స్కూల్) పేరుతో ఏర్పాటు కాగా 5వ తరగతి వరకు బోధించేవారు. నాడు ఎన్‌బీఎస్‌లో చదివిన అనేక మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందినట్లు చెబుతారు. ఈ కాలక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో పంచాయతీ సమితి ద్వారా గ్రామ పంచాయతీ ఖాళీ స్థలంలో 1980లో భవనం నిర్మించారు. ఏడో తరగతి వరకు భారీ సంఖ్యలో విద్యార్థులతో భవానీరోడ్డు ప్రాథమిక ఉన్నత పాఠశాల ఒక వెలుగు వెలిగినప్పటికి ప్రైవేట్ స్కూళ్ల తాకిడికి క్రమక్రమంగా విద్యార్థుల సంఖ్య సున్న కావడంతో 2019లో మూసివేశారు. నాటి నుంచి దీని ఆలనాపాలన లేకపోవడంతో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మళ్లీ తెరవాలి..



విద్యార్థులు లేక భవానీరోడ్డు ప్రాథమిక ఉన్నత పాఠశాల కాలక్రమంలో మూతపడింది. ఇది 1950లో ప్రాంతంలో న్యూ బేసిక్ స్కూల్‌గా ఉండేది. ఎంతో మంది ఈ పాఠశాల ద్వారా అభివృద్ధిలోకి వచ్చారు. అలాంటి పాఠశాలలో విద్యార్థులు తగ్గడంతో మూతపడడం స్థానికుడిగా బాధ కలిగిస్తుంది. ప్రజా ఉపయోగం కోసం స్థలాన్ని వినియోగించాలి.

– దువ్వల నారాయణ, సంఘసేవకులు, కామారెడ్డి

ఉద్యానవనం ఏర్పాటు చేయాలి



కామారెడ్డి పాత పట్టణానికి సంబంధిత ఎలాంటి ఉద్యానవనాలు లేవు. ఖాళీ స్థలాలు లేవు. భవానీరోడ్డు పాఠశాల శిథిలావస్థకు చేరినందున ఈ స్థలంలో పిల్లలు, పెద్దల కోసం ఉద్యానవనం ఏర్పాటు చేసి ఆట పరికరాలు అమర్చాలి. అలాగే మహిళ సంఘాల కోసం భవనం నిర్మించాలి.

– నంగునూరి లత, భవానీరోడ్డు నివాసి

ఆగిన ఆస్పత్రుల పనులు



ఇసన్నపల్లిలో నిలిచిపోయిన బస్తీ దవాఖానా పనులు



రామారెడ్డిలో..

రామారెడ్డి : దవాఖానాల్లో ఓపీ, ప్రాథమిక రోగ నిర్ధారణ పరీక్షలు, గర్భిణులు, బాలింతలకు పరీక్షలు, టీకాలు వేయడం, కుటుంబ నియంత్రణ కౌన్సెలింగ్, రక్తహీనత, షుగర్, బీపీ, క్యాన్సర్ పరీక్షలు, ఇతర ప్రాథమిక చికిత్సలు, ఆరోగ్య పరిరక్షణ అవగాహన చైతన్యం వంటి 57 రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు గత సర్కార్ జనాభా ప్రాతిపదికన ఒక్కో గ్రామంలో ఒకటి నుంచి రెండు బస్తీ దవాఖానాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అప్పట్లోనే రూ. 20లక్షల నిధులను కేటాయించి నిర్మిస్తామన్నారు. అంతవరకు బాగానే ఉన్నా బస్తీ దవాఖానాలకు నిధులు విడుదల కాక కాంట్రాక్టర్లు మధ్యలోనే చేతులెత్తేశారు. కొన్ని గ్రామాల్లో సగం వరకు పూర్తయిన భవనాలకు కాంట్రాక్టర్లు ఇప్పటివరకు రూ. 12 లక్షల వరకు ఖర్చు చేసినట్లుగా చెప్తున్నారు. తాము ఖర్చుపెట్టిన నిధులే ఇప్పటివరకు రాలేదని మరోమారు ఖర్చు పెడితే మా పరిస్థితి ఏంటి అని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం



కామారెడ్డి అర్బన్ : ఈనెల 19 నుంచి 26 వరకు కేరళ రాష్ట్రం కొల్లాంలో నిర్వహించే ఇండియా సబ్ జూనియర్ సౌత్ జోన్ జాతీయ హాకీ ఛాంపియన్ షిప్–2024 పోటీలకు ఎంపికైన గర్గుల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురికి మన ఊరు ఫౌండేషన్ ద్వారా నగదు సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మన ఊరు ఫౌండేషన్ ప్రతినిధులు కే.రాజ్‌కుమార్‌రెడ్డి, కే భీంరెడ్డి, మాచారెడ్డి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎం.రాంరెడ్డి, మన ఊరు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ సతీశ్‌రెడ్డికి ముదిరాజులు వినతిపత్రం ఇచ్చారు. ముదిరాజులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తూర్పు రాజులు, సంఘం మండలాధ్యక్షుడు రెడ్డి రాజులు, నీల రవి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని పూజలు



జలాభిషేకానికి నీళ్లు తీసుకెళ్తున్న గ్రామస్తులు



అన్నారెడ్డిపల్లిలో కప్ప కావడి ఆడుతున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : వర్షాలు కురవాలని మండలంలోని తిమ్మాపూర్ గ్రామస్తులు సోమవారం పలు ఆలయాల్లో దేవతలకు జలాభిషేకం చేశారు. గ్రామంలోని ఉమా సంగమేశ్వరాలయం, గ్రామ దేవతలు, హనుమాన్ ఆలయాలలో దేవతలకు జలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శ్రీనివాస్‌గౌడ్, సాయిబాబా, గంగారాం, నర్సింలు తదితరులున్నారు.

వర్షాల కోసం కప్పకావడి..

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అన్నారెడ్డిపల్లిలో సోమవారం గ్రామస్తులు వర్షాల కోసం కప్ప కావడి ఆడారు. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా నేటికి ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యువకులు, రైతులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.



సదాశివనగర్‌లోని ఆంజనేయాలయంలో భజన

సదాశివనగర్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ మండల కేంద్రంలోని శ్రీ పాతూరి ఆంజనేయ స్వామి ఆలయంలో నిత్యభజన కార్యక్రమం కొనసాగుతుంది. జలాభిషేకాలు నిర్వ హించి కీర్తనలు ఆలపించారు. ఆలయ పూజారి జంగం గంగాధర్, శివాలయ కమిటీ చైర్మన్ ట్రాక్టర్ రాజ య్య, మాజీ చైర్మన్ కొప్పుల నర్సారెడ్డి, ప్రతినిధులు కాటిపల్లి లక్ష్మీకాంతం తదితరులున్నారు.

సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



గాంధారి(ఎల్లారెడ్డి) : రైతులు తాము సాగు పంటలకు సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో నరేష్ సూచించారు. సోమవారం ఆయన చిన్న పోతంగల్ గ్రామాన్ని సందర్శించి సోయాబీన్, మొక్కజొన్న, పత్తి పంటలను పరిశీలించారు. సోయాబీన్ ఆకులు ఎరుపు రంగులోకి మారుతున్నట్లు తెలిపారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ

రాజంపేట : రాజంపేట మండలంలోని అన్నారం, ఆర్గొండ, గుడి తండా, బసన్న పల్లి పొందుర్తి ఎల్లారెడ్డి పల్లి తండా జీపీల పరిధిలో సోమవారం ఉపాధిహామీ సోషల్ ఆడిట్లో భాగంగా గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో కే రాజేశం తెలిపారు. గ్రామసభలో ఏపీవో టీఏలు, పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్స్ సోషల్ ఆడిట్ బృందం, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై సర్వే



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో సోమవారం సీజనల్ వ్యాధులు ప్రబలిన రోగులను గుర్తించడానికి సర్వే నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి విష జ్వరాలు, దగ్గు, జలుబు తదితర సీజనల్ వ్యాధులను గుర్తించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాంరెడ్డి, శ్రవణ్ వైద్య సిబ్బంది యాదగిరి, చంద్రకళ, శుభాష్, భాగ్య, రాజేశ్వరీ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



ఎల్లారెడ్డి : అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం రూ. 26వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఎల్లారెడ్డి సీడీపీవో పరిధిలోని ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకుని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిబాబాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవకర్ణ, సునీత, నిర్మల తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని బగళాముఖి అమ్మవారి పీఠంలో సోమవారం వారాహి నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. వారాహీ నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్, భక్తులు సాయినాథ్, శివరాజ్ తదితరులున్నారు.

ఆలయాలకు విరాళం



భిక్కనూరు : మండల కేంద్రానికి చెందిన రైతు సమన్వయసమితి మండల కన్వీనర్ బోండ్ల రాంచంద్రం రెండు ఆలయాలకు రూ. 16,532 సోమవారం విరాళంగా అందజేశాడు. తన మనవడు సుహన్ రాజ్ పుట్టిన రోజు సందర్భంగా సిద్దరామేశ్వరాలయం అభివృద్ధికి రూ.11,516, అలాగే శ్రీసంతోషిమాత ఆలయం అభివృద్ధి రూ. 5,016 అందజేశాడు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం ప్రధానకార్యదర్శి గంగెళ్లి మధుసూదన్, కోశాధికారి కోడిప్యాక అంజనేయులు, ప్రతినిధులు గంగెళ్లి జగదీశ్వర్, రమేష్, నాయకులు బోండ్ల సునీల్ కల్లూరి సిద్దరాములు, సిద్దరామేశ్వరాలయం ఈవో శ్రీధర్, ఉత్సవ కమిటీ చైర్మన్ లింబాద్రి పాల్గొన్నారు.

ఘనంగా పీర్ల పండుగ

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రమైన పిట్లం శాంతి నగర్ కాలనీ, తాక్యగల్లీలో ఆషూర్ ఖానా వద్ద సోమవారం ఘనంగా నాలే హైదర్ పీర్ల సవారీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆషూర్ ఖానా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కులమతాలకు అతీతంగా పీర్ల పండుగను ధూంధాంగా జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు నాలే హైదర్ పీర్లకు మొక్కులు చెల్లించుకొని సవారీని వీక్షించారు.

మద్నూర్‌లో..

మద్నూర్(జుక్కల్) : మండలంలోని కోడిచిరలో గ్రామస్తులు మొహర్రం పండగను భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా కోడిచిరలో ఐదు రోజుల పాటు నిర్వహించే మొహర్రం కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తు లు తరలివస్తున్నారు. సందర్భంగా భక్తులు పీర్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. పండగ సందర్భంగా హుండీలో రూ. 8 లక్షల నగదు, బంగారం, వెండి కానుకలను భక్తులు చెల్లించారు.



పిట్లంలో ఏర్పాటు చేసిన పీర్లు

శివాలయంలో ప్రత్యేక పూజలు



పిట్లం(జుక్కల్): మండలంలోని రాజన్న కుంట శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు పూలతో ఆలయంను అందంగా అలంకరించారు.

'ప్రతి హిందువు వేదాన్ని తెలుసుకోవాలి'



కామారెడ్డి అర్బన్ : ప్రతి హిందువు వేద ధర్మాన్ని తెలుసుకోవాలనే ఆకాంక్షతో అందరికీ ఉచితంగా వేదాలను నేర్పుతున్నట్లు టేక్రియాల్ శ్రీరామకృష్ణ వైదిక ధర్మ పీఠం వేదపాఠశాల చైర్మన్ శీర్లవంచ కృష్ణమాచార్యులు అన్నారు. వారం రోజులుగా నిర్వహించిన శ్రీచండీ హోమం ముగింపు సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. కులాలకు అతీతంగా గ్రామీణ పేద విద్యార్థులకు ఉచిత వసతితో వేద విద్యను అందిస్తున్నట్లు, ఇప్పటికే కామారెడ్డి, రామాయంపేటల్లో తరగతులు కొనసాగుతున్నాయని, త్వరలో వేములవాడ, నిర్మల్‌లో ప్రారంభించడానికి సన్నహాలు చేస్తున్నట్లు శీర్లవంచ కృష్ణమాచార్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జే. నాగరాజాచార్యులు, డి.రాజుఆచార్య పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో నృసింహ యాగం

మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో సోమవారం స్వాతి నక్షత్రం సందర్భంగా అర్చకులు నారసింహ యాగం నిర్వహించారు. యాగంలో పది జంటలతో పాటు చైర్మెన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు,అర్చకులు పాల్గొన్నారు.



అమ్మవారి హుండీ లెక్కింపు



దోమకొండ : మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. ఆలయ కమిటీ ఈవో ప్రభు ఆధ్వర్యంలో హుండీని లెక్కించగా రూ.77,303 నగదు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు పాలకుర్తి శేఖర్, ప్రతినిధులు రాజిరెడ్డి, రాజనర్సు తదితరులున్నారు.

శివలింగాలయంలో ప్రత్యేక పూజలు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లిలో పంచముఖ శివలింగాలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లింగానికి రుద్రాభిషేకం, పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బోనాలకు రావాలని షబ్బీర్‌కు ఆహ్వానం

దోమకొండ : దోమకొండలోని మహంకాళి బోనాల ఉత్సవాలను రావాల్సిందిగా ఆహ్వానిస్తూ సోమవారం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 21వ తేదీన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల పండుగకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తీగల తిర్మల్‌గౌడ్, డీసీసీ కార్యదర్శి తాటిపల్లి శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి తదితరులున్నారు.



ఉత్సవాలకు ఆహ్వానిస్తూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి ఆహ్వానపత్రం అందిస్తున్న ప్రతినిధులు

సంక్షిప్తం

పీజీటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో బోధించుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. పీజీటీ బోటనీ, ఫిజిక్స్, కెమెస్ట్రీ, తెలుగు, హిందీ, టీజీటీ పోస్టులకు పీజీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 18న కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరుకావాలన్నారు. వీరికి నెలకు రూ. 18 వేలు వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల పరిధిలో పోయిన సెల్ ఫోన్‌ను ట్రేస్ చేసి బాధితుడికి ఎస్సై రాజు సోమవారం అందజేశారు. మండలంలోని పద్మాజీవాడి భూపెల్లి దినేశ్ ఇటీవల బైక్‌పై వెళ్తుండగా ఫోన్ పడిపోయింది. దీంతో బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్‌ను పట్టుకొని బాధితునికి అందజేసినట్లు ఎస్సై తెలిపారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రాజేందర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సదాశివనగర్ మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజేందర్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన భానుమతి శంకరంపేట్‌కు బదిలీ అయిన విషయం విదితమే. ఉన్నతాధికారుల ఆదేశాలతో మళ్లీ భానుమతి సదాశివనగర్ మోడల్ స్కూల్‌లోనే లెక్చరర్‌గా విధులు నిర్వర్తించనున్నట్లు తెలిసింది.

ప్రజావాణికి రెండు ఫిర్యాదులు

రాజంపేట : రాజంపేట మండలం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదులు అందినట్లు తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. విచారణ కోసం సంబంధిత అధికారులకు అందచేసినట్లు ఆయన తెలిపారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రహీమొద్దీన్ మాట్లాడుతూ ఈ ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తెలిపారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ తదితరులున్నారు.

జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కు నివాళులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం జూ.అసిస్టెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నివాళులు అర్పించారు. తాడ్వాయిలో జూ.అసిస్టెంట్‌గా పనిచేసిన ఆత్మహత్య చేసుకోగా సంతాపం వ్యక్తం చేశారు. జూనియర్ అసిస్టెంట్లు రాజు, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రికార్డ్ అసిస్టెంట్ ప్రశాంత్ మృతిపట్ల సోమవారం అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డిలో రికార్డు అసిస్టెంట్లు సోమవారం సంతాపం వ్యక్తం చేశారు. జూ. అసిస్టెంట్ ప్రశాంత్ మృతికి సంతాపం పలికారు. ఈ కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్లు సురేందర్, రాజు, అనిత తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట : మండలానికి చెందిన రికార్డు అసిస్టెంట్ ప్రశాంత్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా ఆయన మృతికి కారణమైన వారికి శిక్షించాలని కోరుతూ మండల జూ.అసిస్టెంట్లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.